

- సీమ ప్రాజెక్టులపై ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి
- వైసీపీ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్వీర్యం
- నిధులు లేక నిలిచిన వేదవతి, ఆర్డీఎస్ పనులు
- దైన్య స్థితిలో గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకం

చంద్రబాబుపైనే ఆశలు



తుంగభద్ర నది ఒడ్డున అసంపూర్తిగా ఆర్డీఎస్ రైట్ కెనాల్ హెడ్ వర్క్

కరువు రైతుల కన్నీళ్లు తుడిచే సాగునీటి ప్రాజెక్టులన్నీ జగన్ ఐదేళ్ల హయాంలో నిర్లక్ష్యానికి గురయ్యాయి. నిధులు ఇవ్వకపోవడంతో వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ పనులు ఆగిపోయాయి. నిర్వహణ నిధులు లేక గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకం అవసాన దశకు చేరుకుంది. గత పాలనలో ఒక్క ఎమ్మెల్యేగాని, మంత్రులుగాని సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా జిల్లాలో నీరున్నా వాడుకోలేని దుర్భర పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో తాజాగా ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వంపోయి చంద్రబాబు సారథ్యాన తెలుగుదేశం పార్టీ అఖండ మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో జిల్లా రైతాంగంలో ఆశలు చిగురిస్తున్నాయి. ఆగిపోయిన ప్రాజెక్టుల పనులకు పురోగతి వస్తుందని సాగునీటి విశ్లేషకులు ఆశిస్తున్నారు. వర్షాధారంపై ఆధారపడిన మెట్ట పొలాలకు తుంగభద్ర, హగరి జలాలు వస్తాయనే నమ్మకం బలపడింది. అదే క్రమంలో మంత్రి టీజీ భరత్ సహా ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని, కోడుమూరు ఎమ్మెల్యేలు ఆయా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

కర్నూలు, జూన్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాకు పశ్చిమ ప్రాంతాలైన ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాల్లో ఏటేటా కరువు, వలసలు రైతులు, కూలీలను వెంటాడుతున్నాయి. వర్షాధార పంటలే ఆధారం కావడంతో సంక్రాంతి ముగియగానే రైతులు, కూలీలు పని వెతుక్కుంటూ వివిధ ప్రాంతాలకు వలస బాటన తరలిపోతున్నారు. దశాబ్దాలుగా ఇదే పరిస్థితి. రాష్ట్ర విభజన తరువాత కొలుదీరిన ఆనాటి టీడీపీ ప్రభుత్వం కరువు, వలస నివారణకు శాశ్వత పరిష్కారం కోసం కసరత్తు చేసింది. అదే సమయంలో అప్పటి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అసెంబ్లీలో కర్నూలు జిల్లా కరువు కన్నీటి కష్టాలను వివరించారు. ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం కోసం నిధులు ఇవ్వాలని పట్టుబట్టారు. జిల్లా జలవనరుల శాఖ ఇంజనీర్లు కూడా నివేదిక పంపారు. కరువు, వలసలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంగా అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఆర్డీఎస్ కుడి కాలువ, వేదవతి ప్రాజెక్టు నిర్మాణాలు రూ.2,927.80 కోట్లు మంజూరు చేస్తూ జీవోలు జారీ చేసింది. అంతేకాకుండా టెండర్లు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టింది. అయితే ఆ తరువాత వచ్చిన జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం కరువు రైతుల పాలిట శాపంగా మారింది. ఎంతో ఉన్నత లక్ష్యంతో 2019కి మునుపు టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన ఆ ప్రాజెక్టు పనులు నిధులు లేక ఎక్కడికక్కడే ఆగిపోయాయి. మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలుదీరడంతో ఐదేళ్లుగా నిర్లక్ష్యం నీడలో కొట్టుమిట్టాడుతున్న కరువు సీమకు జీవనాడులైనా ఈ ప్రాజెక్టులకు పురోగతి వస్తుందనే రైతులు ఆశిస్తున్నారు.

● ఆర్డీఎస్ కుడి కాలువపై దృష్టి సారించాలి

మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లోనే అత్యధికంగా వలసలు ఉన్నాయి. శాశ్వత పరిష్కారం కోసం గత టీడీపీ ప్రభుత్వం ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. 2019 జనవరిలో జీవో ఆర్టీ నం.76 జారీ చేసి రూ.1,985.42 కోట్లు మంజూరు చేశారు. హైదరాబాదుకు చెందిన ఎస్‌సీసీ లిమిటెడ్ సంస్థ పనులు దక్కించుకుంది. ఆర్డీఎస్ అనకట్ట వద్ద హెడ్ వర్క్ పనులు, కాలువ నిర్మాణం పనులను మొదలు పెట్టారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడం వల్ల ఎక్కడి పనులు అక్కడే ఆపేశారు. అప్పట్లో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అసెంబ్లీలో ఆర్డీఎస్ రైట్ బ్యాంక్ కెనాల్ కోసం గళమెత్తారు. ఈ ప్రాజెక్టు మంజూరు చేయాలంటూ చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చారు. అప్పుడు మంత్రాలయం ఇన్‌చార్జిగా ఉన్న తిక్కారెడ్డి కూడా ఈ ప్రాజెక్టు కోసం కృషి చేశారు. ఎట్టకేలకు నాడు చంద్రబాబు నిధులు మంజూరు చేసి పనులు చేపడితే.. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నిధులు లేక పనులు ఆగిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్డీఎస్ కుడి కాలువ కోసం మంత్రాలయం, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, ఎర్రకోట చెన్నకేశవరెడ్డిలు కనీసం కూడా కష్టపడకుండా రైతు ద్రోహులుగా మిగిలిపోయారనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్డీఎస్ కోసం కష్టపడిన బీవీ జయనాగేశ్వరరెడ్డి మళ్లీ ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా గెలిచారు. నిధులు, పరిపాలన అనుమతులు ఇచ్చిన చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అంతేకాకుండా యువగళం పాదయాత్ర సమయంలో యువనేత నారా లోకేశ్ మంత్రాలయం నియోజకవర్గంలో వలసలు కళ్లారా చూశారు. ముళ్ల పొదలతో నిండిపోయిన గురురాఘవేంద్ర ప్రాజెక్టు బసలదొడ్డి జలాశయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కరువు, వలస నివారణ కోసం శాశ్వత ప్రాజెక్టులు చేపడుతామని స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో ఆర్డీఎస్ కుడి కాలువ సాకారం అవుతుందని అన్నదాతలు అంటున్నారు.

ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 196 గ్రామాలకు తాగునీరు ఇవ్వాలనే లక్ష్యంగా గత చంద్రబాబు ప్రభుత్వం వేదవతి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మాణానికి 2019 జనవరిలో రూ.1,942.38 కోట్లు మంజూరు చేస్తూ జీవో.ఆర్‌టీ.నెం.77 జారీ చేసింది. ఫిబ్రవరిలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజనీరింగ్ అండ్

● తీరనున్న వేద'వ్యథ'..!

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సంస్థ పనులు చేపట్టింది. ప్రెజర్ మెయిన్ పైపులైన్-1, ప్రెజర్ మెయిన్ పైపులైన్-3 పనులు, హంద్రీనీవా కాలువ ఒడ్డున ప్రధాన లిఫ్టు పనులు చేపట్టి రూ.90 కోట్లు ఖర్చు చేశారు. ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. ఎక్కడి పనులు అక్కడే అసంపూర్తిగా ఆగిపోయాయి. ఇప్పటికీ నిధులు లేక.. బిల్లులు మంజూరు కాక కాంట్రాక్ట్ సంస్థ పనులు ఆపేసి క్యాంప్ సైట్‌ను ఖాళీ చేసింది. వైసీపీ ప్రభుత్వంలో ఆనాటి పాలకుల నిర్లక్ష్యం కారణంగా పనులు ఎక్కడిక్కడ ఆగిపోయాయి. మళ్లీ టీడీపీ రావడంతో ఆలూరు, ఆదోని రైతుల ఆశలు చిగురిస్తున్నాయి.



హంద్రీనీవా కాలువ వద్ద ఆగిపోయిన వేదవతి ప్రాజెక్టు ప్రధాన పంప్‌హౌస్

● ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి

జిల్లాలో వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులు, అసంపూర్తిగా ఉన్న హంద్రీనీవా ప్రాజెక్టు, గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల నిర్వహణ సహా గుండ్రేవుల ప్రాజెక్టుపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు, ఆదోని ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, డాక్టర్ పార్థసారథిలు దృష్టి సారించాలి. ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిపై అధ్యానం చేయాలి. సమగ్ర నివేదికతో సీఎం చంద్రబాబును కలసి నిధులు, పరిపాలన అనుమతుల కోసం సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఎక్కడికక్కడే వేదవతి ప్రాజెక్టు పైపులు

- ఆలయ పవిత్రతను కాపాడుతాం
- ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి కృషి



సమావేశంలో పాల్గొన్న అధికారులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా

శ్రీశైలం, జూన్ 25: రాబోయే ఐదు దశాబ్దాలను దృష్టిలో ఉంచుకుని శ్రీశైలం క్షేత్రాన్ని బృహత్తర ప్రణాళికతో అభివృద్ధి చేస్తామని శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం దేవస్థానం కార్యాలయ భవనంలోని సమావేశమందిరంలో క్షేత్రాభివృద్ధిపై బుడ్డా రాజశేఖరరెడ్డి సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీశైలం క్షేత్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఆలయ పవిత్రను కాపాడుతామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి శ్రీశైలక్షేత్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి ఉందని తదనుగుణంగా క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలు, దేశం నలుమూలల నుంచి భక్తులు శ్రీశైలక్షేత్రాన్ని సందర్శించి స్వామి, అమ్మవార్లను దర్శించుకునాంటున్నారని, భక్తులకు కల్పించే మౌలికసదుపాయాల కల్పనపై ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా దేవస్థానం అతిథి గృహాలు, వసతిగదులలోని సదుపాయాలను మరింతగా మెరుగుపరచాలన్నారు. పర్వదినాలు, వారాంతరాలు, సెలవు రోజులలో క్షేత్రానికి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్, వసతి తదితర ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే సిబ్బంది అంతా అంకితభావంతో విధులు నిర్వహిస్తూ భక్తులకు సేవలందించాలన్నారు. పరస్పర సమన్వయంతో క్షేత్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. క్షేత్రాన్ని సుందరీకరంగా, ఆహ్లాదకరంగా మార్చేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై విచారణ చేపట్టాలి

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి

కర్నూలు(అర్బన్), జూన్ 25: ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరుతో జరిగిన కుంభకోణంపై విచారణ చేపట్టి, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కఠినంగా శిక్షించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019లో ఒక్క చాన్స్ పేరుతో ప్రజలను మోసం చేసి అధికారం చేపట్టి ప్రజల ఆస్తులను కాజేందుకు జగన్ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తీసుకొచ్చిందన్నారు. నాడు తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని బెంగుళూరు, హైదరాబాద్‌ల్లో ప్యాలెస్‌లు నిర్మించుకున్న జగన్ సీఎం ఉన్న సమయంలో రుషికొండలో రూ.500 కోట్ల ప్రజాధనంతో ప్యాలెస్‌ను నిర్మించుకున్నాడన్నారు. దానికి తోడు ప్రతి జిల్లాలోనూ రూ.కోట్ల విలువైన భూముల్లో అక్రమంగా వైసీపీ కార్యాలయ భవనాలను నిర్మించారన్నారు. వాటిపై ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా జగన్ పార్టీని చిత్తుగా ఓడించారన్నారు. ఆయన చేసిన అక్రమాలు ఒక్కొక్కటి గా వెలుగులోకి వస్తున్నాయన్నారు. ప్రజల సొమ్మును స్వాహ చేసిన జగన్మోహన్‌రెడ్డి అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం నిగ్గుతేల్చాలని సోమిశెట్టి డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, నగర కార్యదర్శి నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

జీడీపీ పైపులైన్ పనుల్లో కదలిక

ఎమ్మిగనూరులో నిలిచిన పనులను పరిశీలించిన అధికారులు

ఎమ్మిగనూరు, జూన్ 25: ఎమ్మిగనూరు పట్టణానికి పుష్కలంగా తాగు నీటిని అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన జీడీపీ పైప్‌లైన్ పనుల్లో కదలిక వచ్చింది. ఐదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ హయంలో ఏఐఐబీ(జీడీపీ తాగునీటి పైప్‌లైన్) పథకం రు.136 కోట్లతో మంజూరైన విషయం తెలిసిందే. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పనులు ఆగిపోయాయి. వైసీపీ నిర్వాకంతో పథకం అమలు ప్రశ్నార్థకంగా మారింది. అయితే రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా ఓడిపోయింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఏఐఐబీ(జీడీపీ తాగు నీటి పైప్‌లైన్) పథకం పనుల్లో కదలిక వచ్చింది. పనులు తిరిగి ప్రారంభించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులను కలిసి ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో మంగళవారం ఏఐఐబీ టీం అధికారులు ఎమ్మిగనూరు పట్టణంలో ఆయా ప్రాంతాల్లో అర్థాంతరంగా నిలిచిపోయిన ఓహెచ్‌ఆర్ ట్యాంకులు, ఫిల్టర్ బెడ్లను పరిశీలించారు. పథకం రాష్ట్ర స్థాయి టెక్నికల్ అడ్వయిజర్ మోహన్, అనంతపురం పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనాథ్‌రెడ్డి, ఈఈ చంద్రమోహన్, కర్నులు డిప్యూటీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ జ్యోతి, ఏఈ నాగశేఖర్ నిలిచిపోయిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు.. పనులు ఏఏ దశల్లో ఉన్నాయి ఎంతమేరకు జరిగాయోనని పరిశీలించామన్నారు. వీటిపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరిగి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.



ఓహెచ్‌ఆర్ ట్యాంకులను పరిశీలిస్తున్న అధికారులు

కుక్కపై దాష్టీకం

- శునకాన్ని గిరగిరా తిప్పి హింసించిన యువకుడు
- ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టింగ్
- కేసు నమోదు, అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఆలూరు, జూన్ 25: సోషల్‌మీడియా ద్వారా ఫేమస్ కావాలన్న ఆలోచనతో వికృత వీడియోలు తీస్తున్నారు కొందరు యువకులు. చెత్త వీడియోలు తీస్తూ అందరూ అసహ్యించుకునేలా తయారయ్యారు. తాజాగా ఆలూరుకు చెందిన యువకుడు ఓ కుక్క కాళ్లను పట్టుకుని గిరాగిరా తిప్పి విసిరి పడేసిన అమానవీయ ఘటన నెట్టింట వైరల్‌గా మారింది. ఆలూరు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన వినోద్ అనే యువకుడు ఓ వీధి కుక్కను హింసిస్తూ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా 4 రోజుల క్రితం వీడియో పోస్ట్ చేశాడు. దీన్ని చూసి ఆగ్రహించిన కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం మార్కాపురానికి చెందిన స్ట్రే ఎనిమల్ ఫౌండేషన్ మేనేజర్ అదిలాపురం గౌతం ప్రివెంట్స్ ఆఫ్ ఎనిమల్స్ కృయాలిటీ చట్టం ద్వారా కేసు నమోదు చేయాలని ఆలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారించి ఆ యువకుడిని మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు.



ఫారెస్టు రేంజ్ అధికారిగా
విజయ్‌కుమార్

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూన్ 25: కర్నూలు ఫారెస్టు రేంజ్ అధికారిగా జి.విజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లా వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ డిప్యూటి రేంజ్ అధికారిగా పనిచేస్తున్న ఈయనను ప్రభుత్వం పదోన్నతిపై కర్నూలుకు బదిలీ చేసింది. గత కొంతకాలంగా ఇక్కడ ఫారెస్టు రేంజ్ అధికారిగా ఇంచార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న రమణారెడ్డి తిరిగి ఆయన యథాస్థానం బద్వేలుకు వెళ్లారు.

పదవీ విరమణ పొందిన పోలీసు జాగిలం

నంద్యాల క్రైం, జూన్ 25 : నేరం జరిగిన ప్రదేశంలో ఆధారాలు వెతకడం, పోలీసులకు క్లూస్ అందించడం... ఇదీ జాగిలం టీనా పని. కానీ ఈ పనులు చేయడానికి వాటికి చాలా శిక్షణ ఇవ్వాలి. హత్య, దొంగతనం, పేలుడు పదార్థాలు, డ్రగ్స్‌ను గుర్తించడం వంటి నేరాలను ఛేదించేందుకు పోలీసులకు ఉన్న ఆయుధం ఈ జాగిలే. అయితే పోలీసు జాగిలం టీనా పదవీవిరమణ సందర్భంగా పోలీసు అధికారులు ఎమోషనల్ అయ్యారు. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ల్యాబిడార్ రెత్రివర్ జాతికి చెందిన పోలీసు జాగిలం టీనా మంగళవారం పదవీ విరమణ పొందింది. నంద్యాల జిల్లా సాయుధ రిజర్వు పోలీసులు పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీఐపీ, వీవీఐపీల బందోబస్తు విధుల్లో పేలుడు పదార్థాలను కనుక్కోవడం టీనా ప్రత్యేకత. ఈ జాగిలం సుమారు 9 సంవత్సరాల 7 నెలలు ఉమ్మడి జిల్లాలో పోలీసు శాఖలో సేవలందించింది. ఈ సందర్భంగా ఎస్పీ రఘువీర్‌రెడ్డి పోలీసు జాగిలం టీనాకు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు టీనా సేవలు అందించిందని అన్నారు. అనంతరం టీనా హ్యాండ్లర్ ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్ వై.సుంకిరెడ్డిని కూడా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఇకపై జాగిలం టీనా జిల్లా కేంద్రంలోని డాగ్‌హోంలో ఉంటుందని అధికారులు తెలిపారు.



పోలీస్ జాగిలం టీనకు సాలువ కప్పి, పూలమాలతో సత్కరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్


సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

సి. బెళగల్, జూన్ 25: మండలంలోని తిమ్మనదొడ్డి వద్ద తుంగభద్ర నదితీరం నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న తెలంగాణకు చెందిన 5 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ తుంగభద్ర నదితీర గ్రామాలలో నుండి అక్రమంగా ఇసుక తరలిస్తే జరిమానా రూ 50 వేలు విధిస్తామని, ట్రాక్టర్లు సీజ్ చేస్తానని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన 4 ట్రాక్టర్లతో సోమాపురం గ్రామానికి చెందినవారు తెలంగాణ హద్దులను దాటి ఆంధ్ర హద్దులల్లోకి వచ్చి ఇసుక తరలించుకపోవడానికి ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంలో పలుమార్లు హెచ్చరించామని అన్నారు. తెలంగాన నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను స్టేషన్ తరలించి కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

రోగులకు మెరుగైన సేవలు


మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), జూన్ 25: ఆసుపత్రిలో పది ఓపీ కౌంటర్ల ద్వారా సాధారణ రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని, ఓపీ కౌంటర్లను పెంచడం ద్వారా దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు త్వరగా చికిత్స పొందుతున్నారని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం ధన్వంతరి హాలులో ఆసుపత్రిలోని వివిధ విభాగాల అధిపతులతో సూపరింటెండెంట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలోని ఆరోగ్యశ్రీ టార్గెట్‌ను విజయవంతంగా పూర్తి చేసిన జనరల్ సర్జరీ, సైక్రియాట్రిక్ హెచ్‌వోడీలను సూపరింటెండెంట్ అభినందించారు. ఆసుపత్రిలోని ఈ-హాస్పిటల్‌లో ఫార్మసీ ల్యాబ్ మాడ్యూల్ ఇంకా మెరుగుపడాలన్నారు. ఆక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో పడకల కొరత కారణంగా ఓల్డ్ బ్లడ్ బ్యాంకులో మరో 12 పడకలతో ఏంఎసీ పొడిగింపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మందుల డిస్పెన్సరీతో కనెక్ట్ చేయని గదుల ద్వారా న్యూ క్యాజువాలిటీ, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగానికి రెండు గదులు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఏఆర్ఎంవో వెంకటరమణ, న్యూరాలజీ, రేడియాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్, మెడిసిన్, నెఫ్రాలజీ హెచ్‌వోడీలు సి. శ్రీనివాసులు, రాధారాణి, మంజులబాయి, విజయానందబాబు, ఇక్బాల్ హుసేన్, ఆనంత్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ శివబాల పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

● రాయలసీమ వర్సిటీ వీసీ సుధీర్ ప్రేమ్ కుమార్



సదస్సులో పాల్గొన్న అధికారులు

కర్నూలు(అర్బన్), జూన్ 25: మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ యువతకు పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల నివారణ, నిషేధంపై మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీతో పాటు స్పెషల్ ఎన్‌ఫోర్స్ బ్యూరో ఏఎస్పీ ఎం.నాగరాజు, సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం యువత మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. వాటిని తీసుకోవడం వల్ల వచ్చే దుష్ప్రభావాలు, వాటిని తీసుకుంటే చట్టపరమైన శిక్షల గురించి వివరించారు. ఈ సదస్సులో ప్రిన్సిపాళ్ల ప్రసాదరెడ్డి, సీవీ కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్.నాగరాజు, కేవీ రత్నం, నాగచంద్రుడు, విజయుడు, శివప్రసాదరెడ్డి తదితరులు అధ్యాపకులు పాల్గొన్నారు.

పీరుసాహెబ్ పేటలో ఉద్రిక్తత


పీరుసాహెబ్ పేట గ్రామంలో ఇరువర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

మిడుతూరు, జూన్ 25: మండల పరిధిలోని పీరుసాహెబ్ పేట గ్రామంలో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పాత కక్షలు మనసులో పెట్టుకుని రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. గ్రామస్థుల మేరకు.. పీరుసాహెబ్ పేట గ్రామంలో వడ్డె సామాజిక వర్గానికి చెందిన కొందరు యువకులు గత ఏడాది వినాయక చవితి సందర్భంగా ఘర్షణ పడ్డారు. ఆ సమయంలో పరస్పరం దాడులు చేసుకోవడంతో కేసులు నమోదయ్యాయి. ఈ పాత కక్షలు మనసులో పెట్టుకుని మంగళవారం సాయంకాలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా ప్రత్యర్థి వర్గానికి చెందిన వారు దాడులకు పాల్పడ్డారు. ఈ ఘర్షణలో లక్ష్మీనరసమ్మ, రమణమ్మ, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ జగన్ మోహన్ అప్రమత్తమై పోలీసు సిబ్బందితో గ్రామానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

డీఈవో వర్సెస్ సమగ్ర శిక్ష ఏపీసీ

● అయోమయంలో ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది



కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 25: జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు అధికారి మధ్య కోల్డ్ వార్ జరుగుతోంది. జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలోని ఉద్యోగులు ఎవరి మాట వినాలో తెలియని అయోమయంలో పడ్డారు. జిల్లా సమగ్ర శిక్ష కన్వీనర్‌గా జిల్లా విద్యాశాఖ అధికారి ఉంటారు. చైర్మన్‌గా కలెక్టర్ కొనసాగుతారు. పాఠశాల విద్యాశాఖకు సంబంధించిన వివిధ అంశాలను జిల్లా విద్యాశాఖ అధికారి, ఎస్ఎస్ ఏపీసీ ఇద్దరు సమన్వయం చేసుకుని పని చేయాలి. అయితే ఈ అధికారులు ఎవరంతకు వారు తన కనుసన్నల్లోనే అడ్మిషన్లు నడవాలని అనుకున్నట్లు ఉంది. జిల్లా విద్యాశాఖ అధికారి ఒక అడుగు ముందుకు వేసి ఈ నెల 24వ తేదీన ఎస్ఎస్ ఏపీసీ విజయజ్యోతి కుమారిని రిలీవ్ చేసి అదే రోజు జిల్లా విద్యాశాఖ అధికారి శామూయేల్ తన కార్యాలయ ఉద్యోగులతో ఎస్ఎస్ ఏపీసీ చాంబర్‌కు వెళ్లి చార్జ్ తీసుకున్నారు. సమగ్ర శిక్ష కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ద్వారా చేపట్టిన పథకాలు సక్రమంగా అమలు చేయాలని డీఈవో సూచించారు. కార్యాలయానికి వచ్చిన ఫైల్స్‌ను గ్రీవెన్స్‌ను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని విధి నిర్వహణలో ఎటువంటి జాప్యం జరిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తూ డీఈవో పలు సూచనలు ఇచ్చారు. ఇదిలా ఉండగా.. ఎప్పుడో ఫిబ్రవరిలో కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్స్‌తో ఇప్పుడు రిలీవ్ చేయడం ఏమిటనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఎస్ఎస్ ఏపీసీ చార్జ్ తీసుకున్న వెంటనే జీసీడీవో, అలెస్కో సెక్టోరల్ అధికారులను డీఈవో శామూయేల్ రిలీవ్ ఆర్డర్స్ కూడా ఇచ్చారు. కార్యాలయంలో ఏం జరుగుతుందో ఉద్యోగులకు తెలియడం లేదు. అసలు ఎస్ఎస్ ఏపీసీ ఎవరనే ప్రశ్న ఇటు ఉద్యోగుల్లోనూ, అటు కార్యాలయానికి వచ్చిన ప్రజల్లో మిగిలింది. ఇద్దరు అధికారుల మధ్య మనస్పర్థలు తారా స్థాయికి చేరాయి. కలెక్టర్ జోక్యం చేసుకోకపోతే ఈ వ్యవహారం ముదిరి పాకాన పడే అవకాశం ఉంది.

● నన్ను రిలీవ్ చేసే అధికారం డీఈవోకు లేదు

డిప్యూటీ కలెక్టర్ క్యాడర్ స్థాయిలో ఉన్న నన్ను రిలీవ్ చేసే అధికారం జిల్లా విద్యాశాఖ అధికారులకు లేదు. గత ఫిబ్రవరిలో వచ్చిన ఆర్డర్‌తో ఇప్పుడు ఎలా రిలీవ్ చేస్తారు? కలెక్టర్ నోటిఫైల్ అప్రూవల్ లెటరు కూడా లేకుండా డీఈవో రిలీవ్ ఆర్డర్‌ను కార్యాలయ సూపరింటెండెంట్‌కు ఇచ్చి సీటులో కూర్చోవాల్సిన అవసరం ఏమిటో తెలియడం లేదు. కలెక్టర్‌ను బైపాస్ చేసి ఫైల్‌ను ఫార్వర్డ్ చేశారు. రిలీవ్ ఆర్డర్‌ను సూపరింటెండెంట్‌కు ఇస్తే.. అది నాకు ఇచ్చినట్లేనా? ఈ విషయాన్ని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావుకు మంగళవారం వివరించాను.

- సమగ్ర శిక్ష ఏపీసీ విజయ జ్యోతి కుమారి

● కలెక్టర్ ఆదేశాల మేరకే రిలీవ్ చేశాం

కలెక్టర్ నోటిఫైల్ ఆర్డర్స్ ఆదేశాల మేరకు ఎస్ఎస్ ఏపీసీకి నిబంధనలకు లోబడే రిలీవ్ ఆర్డర్ ఇచ్చాను. కలెక్టర్ రిలీవ్ చేయమంటేనే చేశాను. ఇందులో నా ప్రమేయం ఏమీ లేదు. ఫిబ్రవరి 16వ తేదీనే ఎస్ఎస్ఏ ఏపీవోకు రిలీవ్ ఆర్డర్స్ వచ్చాయి. అప్పుడు ఎన్నికల నోటిఫికేషన్ రావడం, సంబంధిత అధికారి అవసరాల మేరకు రిలీవ్ చేయలేదు. ఎన్నికల కోడ్ ముగియడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రిలీవ్ చేశాను.

- జిల్లా విద్యాశాఖ అధికారి శామూయేల్

అనుమతి లేకుండా రోడ్డు వేస్తున్నందుకే కేసులు

అల్ట్రాటెక్ సిమెంట్ యాజమాన్యం నిబంధనలు అతిక్రమించింది ● ఆర్‌అండ్‌బీ ఈఈ


విలేఖర్లతో మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి

బనగానపల్లె, జూన్ 25: రోడ్లు, భవనాల శాఖ అనుమతులు లేకుండా రోడ్డు నిర్మిస్తుండడం వల్లనే అల్ట్రాటెక్ సిమెంట్ యాజమాన్యంపై, తుమ్మలపెంటకు చెందిన కాంట్రాక్టరు నాగమల్లేశ్వరరెడ్డిపై కేసులు నమోదు చేసినట్లు నంద్యాల జిల్లా ఆర్‌అండ్‌బీ ఈఈ ఏవీ. శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్లు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఒత్తిడి వల్లనే తాము అల్ట్రాటెక్ సిమెంట్ యాజమాన్యం, నాగమల్లేశ్వరరెడ్డిపై కేసులు పెట్టామనడం అవాస్తవమన్నారు. ఈ కేసుతో రోడ్ల భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదన్నారు. మంత్రిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మిస్తుండడం వల్లనే కేసు నమోదు చేశామన్నారు. తాను అంకిరెడ్డిపల్లె నుంచి తుమ్మలపెంటకు వెళ్తుండగా ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన తమ శాఖ అనుమతులు లేకుండా అల్ట్రాటెక్ సిమెంట్ యాజమాన్యం తరపున తుమ్మలపెంటకు చెందిన నాగమల్లేశ్వరరెడ్డి 150 మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు రోడ్డు వేసినా కేసులు పెడతామన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్ రెడ్డి, ఏఈ హుసేన్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో హత్య

● టీడీపీకి చెందిన దంపతులపై దాడి
● ఘటనలో భాస్కర్ రెడ్డి భార్య మృతి
● ఆస్తి గొడవలే కారణమంటున్న పోలీసులు


మృతురాలు శ్రీదేవి (ఫైల్)


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భాస్కర్ రెడ్డి

నంద్యాల, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన టీడీపీ వర్గీయుల మీద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనలో టీడీపీ నాయకుడు అట్ల భాస్కరరెడ్డి గాయపడగా, ఆయన భార్య శ్రీదేవి (55) మృతి చెందింది. ఆళ్ళగడ్డ పట్టణం పాత బస్టాండ్ ప్రాంతంలోని పాతూరు వీధిలో నివాసం ఉండే భాస్కర్‌రెడ్డి, ఆయన భార్య శ్రీదేవి మంగళవారం సాయంత్రం 6:30 గంటల సమయంలో బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చారు. వాహనం దిగి ఇంట్లోకి వెళ్తుండగా ముసుగులు వేసుకున్న ఓ మహిళ ముగ్గురు పురుషులు ఒక్కసారి దాడికి దిగారు. వచ్చీ రావడంతోనే భాస్కరరెడ్డి దంపతుల కళ్లలో కారంకొట్టి ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో శ్రీదేవి అక్కడికక్కడే మృతి చెందింది. భాస్కరరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి, తర్వాత మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అసలే ఫ్యాక్షన్ గడ్డ, పైగా కొద్ది రోజులుగా ఆళ్ళగడ్డలో పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్నాయి. దీనికి తోడు హత్య జరిగింది ఓ టీడీపీ ముఖ్య నాయకుడి ఇంటి వెనుకే కావటంతో, ఇది కచ్చితంగా ఫ్యాక్షన్ హత్యే అని భావించిన పట్టణ ప్రజలు, పోలీసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. బాధితుడిని పరామర్శించడానికి వచ్చిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హత్య విషయంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులు ఎవరో వెంటనే తేల్చాలంటూ పోలీసులను ఆదేశించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి అనుమానితులు ఎవరన్న దానిపైన క్షుణ్ణంగా ఆరా తీశారు. దాడి కేవలం ఆస్తి గొడవల వల్లే జరిగిందని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. భాస్కర్‌రెడ్డికి ఆయన తమ్ముడు అట్ల గోపాల్‌రెడ్డి మధ్య కొన్నేళ్లుగా ఆస్తి గొడవలు నడుస్తున్నాయని, దీనిని మనసులో పెట్టుకుని గోపాల్‌రెడ్డి, ఆయన భార్య శిరీష కొద్ది మరికొంతమందితో కలిసి భాస్కర్‌రెడ్డి దంపతుల మీద దాడికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. ఇది పూర్తిగా ఆస్తి గొడవే కానీ, ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'బాబుప్రసాద్ మృతి కేసులో వైసీపీ నేత హస్తం'

అవుకు, జూన్ 25 : నంద్యాల జిల్లా అవుకు పట్టణం ఈబీసీ కాలనీకి చెందిన బాయకాటి బాబుప్రసాద్ మృతి కేసులో వైసీపీ నేత చల్లా విక్రాంత్‌రెడ్డి, డ్రైవర్ సురేంద్ర, సునీల్ వ్యక్తుల హస్తం ఉన్నట్లు మృతుడి తల్లి వరలక్ష్మమ్మ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. బాబుప్రసాద్ సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలసిందే. బాబుప్రసాద్, అతని ఇంటి పక్కన ఉన్న వారు స్థలం విషయంలో గొడవపడ్డారు. ఈ విషయంపై చల్లా విక్రాంత్‌రెడ్డి పంచాయతీ చేసి బాబుప్రసాద్‌ను బెదించినట్లు కుటుంబసభ్యుల వాదన. ఈనెల 24వతేదీ మధ్యాహ్నం 12-30 గంటలకు బాబుప్రసాద్ అవుకు రిజర్వాయర్ పాలేరు స్లూయిస్ గేట్లపై నుంచి కిందపడి తలకు బలమైన గాయమై చనిపోయినట్లు పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. తల్లీ, కుటుంబసభ్యులు మాట్లాడుతూ బాబుప్రసాద్ ఆత్మహత్య చేసుకోలేదని హత్యచేసి రిజర్వాయర్ గేట్లపై నుంచి కిందికి పడేశారని ఆరోపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయంత్రం 4గంటల ప్రాంతంలో బనగానపల్లె సీఐ తిమ్మారెడ్డి, అవుకు ఎస్ఐ కిరణ్‌బాబు పర్యవేక్షణలో డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించారు. తల్లి వరలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు చల్లా విక్రాంత్‌రెడ్డి, డ్రైవర్ సురేంద్ర, సునీల్ ముగ్గురిపై 302 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపారు.

చిరుతపులి దాడిలో మహిళ మృతి

శిరివెళ్ల, జూన్ 25: నంద్యాల-గిద్దలూరు రహదారిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న పచ్చర్ల గ్రామంలో చిరుతపులి దాడి చేసిన ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. మహదేవపురం మజరా గ్రామమైన పచ్చర్లకు చెందిన షేక్.మెహరున్నిసా(40) కట్టెల కోసం మంగళవారం అడవిలోకి వెళ్లింది. అటవీ ప్రాంతంలోని వాగు సమీపంలో కట్టెలు సేకరించుకుంటుండగా చిరుతపులి ఆమె తలపై దాడి చేయడంతో గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల కట్టెలు సేకరిస్తున్న మహిళలు వచ్చేసరికి మెహరున్నిసాను చిరుతపులి అడవిలోకి లాక్కెళ్లింది. ఈ ఘటనలో మెహరున్నిసా తీవ్ర గాయాలపాలై మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పచ్చర్ల ఫారెస్టు రేంజి ఆఫీసర్ ఈశ్వరయ్య అటవీ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మూడు రోజుల క్రితం పచ్చర్లలోని ఓ మహిళపై చిరుతపులి దాడికి యత్నించిందని అన్నారు. దీంతో చిరుతను పట్టుకునేందుకు ట్రాప్ కెమెరాలు, బోన్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

ఆదోని టౌన్, జూన్ 25: ఆ తల్లికి ఏ కష్టం వచ్చిందో కానీ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. రైల్వే పోలీసు స్టేషన్ ఎస్సై గోపాల్ తెలిపిన వివరాలు మేరకు.. ఆదోని-నగరూరు రైల్వే స్టేషన్ల మధ్య మంగళవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో 30 ఏళ్ల వయస్సు కలిగిన ఓ మహిళ ఆదోని-నగరూర్ రైల్వేస్టేషన్ల మధ్య 493/10 కి.మీ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యచేసుకున్నట్లు తెలిపారు. ఆమె దగ్గర ఎలాంటి గుర్తింపు ఆధారాలు లేవని అన్నారు. లైట్ రెడ్ కలర్ లెగ్గిన్, బ్లూ రంగు డాట్స్ గల గులాబీ టాప్ ధరించి ఉందన్నారు. వివరాలు తెలిసినవారు తన నెంబర్ 849157634కు సమాచారం ఇవ్వాలని అన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 25: తను ప్రేమిస్తున్న అమ్మాయిని పెళ్లి చేసుకుంటానో లేదోనన్న ఆందోళనతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న అత్యంత విషాదకర సంఘటన కొలిమిగుండ్లలో మంగళవారం జరిగింది. గ్రామంలోని ఎంఈవో కార్యాలయం సమీపంలో నివసిస్తున్న ఎరికలి సింహాద్రి(19) ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఈ అఘాయాత్యానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. సీఐ గోపినాథ్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


గనుల శాఖ తనిఖీలు

కర్నూలు(అర్బన్), జూన్ 25: చైతన్య ప్రాజెక్టు కార్యాలయంలో గనుల శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఉద యం కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు ఆధ్వర్యంలో రికార్డులు పరిశీలించారు. గాలిమరల నిర్మాణం ప్రాజెక్టు కోసం గ్రావెల్, ఇతర ముడిసరుకు ఏమేర తరలించారనే దానిపై అడిగి తెలుసుకుని, సదరు ప్రాజెక్టు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం రాయల్టీలతోపాటు పెనాల్టీలను వసూలు చేస్తామని తెలిపారు.

నిరర్థక పీఎం కిసాన్ పథకం

ఏటా తగ్గిపోతున్న రైతుల సంఖ్య
కొత్త వారికి నో చాన్స్.. ఐదేళ్లుగా పని చేయని వెబ్‌సైట్
పట్టించుకోని నాటి వైసీపీ సర్కార్





కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 25 : ఈ రైతు పేరు రాము.. కోడుమూరు మండలం క్రిష్ణాపురం గ్రామంలో రెండు ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నాడు. కొన్నేళ్లుగా వ్యవసాయంలో కలిసి రాక కుటుంబ జీవనం కోసం కర్నూలు వచ్చి రాజ్‌విహార్ ప్రాంతంలో టీ కొట్టూ నిర్వహిస్తున్నాడు. గత ఐదు సంవత్సరాలుగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఇప్పటి దాకా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 17 విడతల డబ్బులు బ్యాంకు ఖాతాకు విడుదల కాలేదు. ఎందుకిలా జరుగుతుందో అర్థం గాక వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో వెబ్‌ల్యాండ్ యాప్‌లో రైతు పేరు నమోదైతేనే ఈ పథకం డబ్బులు బ్యాంకు ఖాతాకు విడుదలవుతాయని వ్యవసాయాధికారి చెప్పడంతో అతను మీసేవా కేంద్రం చుట్టూ తిరుగుతున్నాడు. ఆ వెబ్‌ల్యాండ్ సైట్ ఎప్పుడు ఓపెన్ అవుతుందో చెప్పలేమని మీసేవా కేంద్రం నిర్వాహకులు చెప్పేశారు. దీంతో ఇక ఈ పథకంలో కింద తనకు అవకాశం లేనట్లేనని రాము ఆవేదన వ్యక్తం చేశాడు. గత వైసీపీ ప్రభుత్వం ఈ పరిస్థితిని నివారించడానికి చర్యలు తీసుకోకపోవడమే దీనికి కారణం.

కర్నూలు, నంద్యాల జిల్లాలో 7 లక్షల మంది రైతులు ఉంటే కేవలం 3 లక్షల మంది రైతులకు మాత్రమే ఈ పథకం కింద డబ్బులు బ్యాంకు ఖాతాలకు జమ అవుతున్నాయి. దాదాపు 4 లక్షల మంది రైతులు వివిధ కారణాల వల్ల పీఎం కిసాన్ నిధి పథకానికి అర్హత లేకుండా పోతున్నారు. ఆచరణలో ఈ పథకం నిరర్థకంగా తయారైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● ఏటా తగ్గిపోతున్న లబ్ధిదారుల సంఖ్య

ఈ నెల 18వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 17వ విడత నిధులను విడుదల చేశారు. కర్నూలు జిల్లాలో 2,34,000 మంది రైతులకు గాను రూ.46.97 కోట్లు ఒక్కో రైతుకు రూ.2వేల చొప్పున 17వ విడత డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదల చేశారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో 1,95,000 మంది రైతులకు రూ.39.19 కోట్ల నిధులను రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. రెండు జిల్లాల్లో 4 లక్షల మంది రైతులకు రూ.86.16 కోట్లను విడుదల చేశారు. ఈసారైనా తమకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా 17వ విడత రూ.2వేలు బ్యాంకు ఖాతాలకు జమ అయ్యాయేమోనని రైతులు బ్యాంకుల వద్ద క్యూ కట్టారు. గంటల తరబడి వేచి చూసి చివరకు కౌంటరు దగ్గరకు వెళితే బ్యాంకు సిబ్బంది మీ పాసుబుక్‌లో డబ్బు పడలేదని చెప్తున్నారు. కర్నూలు జిల్లాలో 16వ విడత 2,96,973 మంది రైతులను ఈ పథకం కింద అర్హులుగా చేర్చి రూ.59.30 కోట్ల నిధులను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేర్చారు. 17వ విడత మంగళవారం రూ.2.34 లక్షల మంది రైతులకు మాత్రమే ఈ పథకం కింద రూ.46.97 కోట్ల నిధులను జమ చేశారు. 16వ విడత విడుదల చేసిన నిధులతో పోలిస్తే.. రూ.12.42 కోట్ల నిధులను తగ్గించేశారు. 62,120 మంది రైతులను అకారణంగా జాబితా నుంచి తొలగించేశారు. నంద్యాల జిల్లాలో కూడా దాదాపు 50వేల మంది రైతులకు సంబంధించి అర్హులైన రైతులను జాబితా నుంచి తొలగించారు. దాదాపు రూ.9 కోట్ల నిధులకు కోత పెట్టేశారు.

● కొత్త వాళ్లకు నో చాన్స్

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని 2019లో ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఈ పథకంలో మొదట్లో ఉన్న వారు తప్పితే.. కొత్తవారికి పథకం ద్వారా లబ్ధి కలగడం లేదు. ఇందులో కొత్తవారు చేరేందుకు వెబ్‌ల్యాండ్ యాప్ ఇప్పటి దాకా ఓపెన్ కాలేదు. దీంతో రైతులు వ్యవసాయాధికారుల కార్యాలయాల చుట్టూ, మీసేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. జాబితాలో పాతవారిని తొలగించేస్తూ కొత్తవారు ఏ చేరే అవకాశం లేకుండా చేయడంతో రైతులు వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కేంద్ర ప్రభుత్వం పథకం ద్వారా సంవత్సరంలో మూడు విడతలుగా ఒక్కో విడతకు రూ.2వేల చొప్పున రూ.6వేల మొత్తాన్ని పెట్టుబడి సాయం కింద అందిస్తూ వస్తోంది.

● నిర్లక్ష్యంతో గత వైసీపీ ప్రభుత్వ కాలయాపన

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంలో ఏపీలో అర్హులైన రైతులంతా లబ్ధి పొందేందుకు చర్యలు చేపట్టడంలో గత వైసీపీ ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు ఉన్నాయి. ఏటా పాత జాబితాలో చోటు దక్కించుకున్న రైతులను అనర్హులుగా తొలగిస్తున్నారు. కొత్తగా పొలాలు కొనుక్కున్న రైతులకు లబ్ధిదారుల జాబితాలో చోటు దక్కడం లేదు. ఈ సమస్యలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని అర్హులైన రైతులకు ఈ పథకంలో లబ్ధి చేకూర్చడానికి ప్రయత్నించలేదు. తెలుగుదేశం ప్రభుత్వమైనా తమకు న్యాయం చేస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

సమసమాజ స్థాపన కోసం కృషి చేయాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ.గఫూర్

కర్నూలు(న్యూసిటీ), జూన్ 25: భారతదేశంలో సమసమాజ స్థాపన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ.గఫూర్ పిలుపునిచ్చారు. మంగళవారం కార్మిక కర్షక భవన్‌లో సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు ఎండీ ఆనంద్‌బాబు అధ్యక్షతన మూడో రోజు జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈసందర్భంగా గఫూర్ మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో పాలకులు మారుతున్న ప్రజల సమస్యలు తీరడం లేదన్నారు. నూతన టెక్నాలజీ అభివృద్ధి చెందుతూ వైద్యం అందరికీ అందుబాటులో ఉందని భ్రమిస్తున్న ఈ కాలంలోనే ప్రభుత్వ లెక్కల ప్రకారం మనిషి సగటు జీవితం కాలం 67.24గా ఉందన్నారు. కానీ నేడు దేశంలో సంఘ టిత, అసంఘటిత రెండు రంగాలలోనూ ప్రజలు ఉపాది దొరకని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు టి.రాముడు, ఎం.రాజశేఖర్, ఎం.విజయ్, నగేష్, అరుణమ్మ, ఈ.పుల్లారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు



సంబరాల్లో టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, జూన్ 25: నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఓర్వకల్లులో మంగళవారం టీడీపీ నాయకులు, బీజేపీ అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నాయకులు వందనాలు, హరిరెడ్డి, మునిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీ పార్లమెంటు డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా నంద్యాల లోక్‌సభ సభ్యురాలు బైరెడ్డి శబరిని నియమించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో నాయకులు దానమయ్య, శ్రీరాజు, ఇమానుయేల్, అయ్యన్న, వడ్డె మహేష్ పాల్గొన్నారు.

మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు సన్మానం

కల్లూరు, జూన్ 25: రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను నంద్యాల జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ సన్మానించారు. మంగళవారం నంద్యాలలోని మంత్రి నివాసంలో ఫరూక్‌ను టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి పూలబొకేలు అందించి శాలువాలతో సన్మానించారు. అలాగే నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యను ఆయన నివాసంలో కలిసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నంద్యాల నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు విజయగౌరి పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై హర్షం

కర్నూలు(లీగల్), జూన్ 25: ల్యాండ్ టైటిలింగ్ యాక్టును టీడీపీ ప్రభుత్వం రద్దు చేసి ప్రజల హక్కులను కాపాడినందుకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ మంగళవారం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఐఏఎల్ జిల్లా కమిటీ సమావేశమై టీడీపీ ప్రభుత్వం న్యాయవాదుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని, జూనియర్ న్యాయవాదులకు ఇచ్చే స్టయిఫండ్‌ను పెంచాలని వారు డిమాండ్ చేశారు. న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ.100కోట్లు విడుదల చేయాలని తీర్మా ణించారు. ఈ సమావేశంలో ఐఏఎల్ నాయకులు రవికాంత్ ప్రసాద్, కె.రం గనాథ్, ఈ.రాజేష్, పి.దస్తగిరి, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

29న గురుకుల ప్రవేశ పరీక్షలు

సి.బెళగల్, జూన్ 25: మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 6, 8, 9 తరగతుల సీట్లను భర్తీ చేయడానికి 29 తేదీన ఉదయం 10 గంటలకు గురుకుల పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బాలరాముడు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థులు పరీక్షకు హాజరయ్యేవారు రెండు ఫొటోలు, ఆధార్ కార్డు తీసుకుని రావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

రైతు ప్రయోజనాలను కాపాడండి

సీఎం చంద్రబాబుని కలిసిన ఆగ్రోస్ స్టేట్ ఎంప్లాయిస్ సంఘం ప్రతినిధులు

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 25: ఆగ్రోస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేలా ఆగ్రోస్ సంస్థ స్థలంలో వైసీపీ కార్యాలయం నిర్మిస్తున్నారని, దాన్ని తొలగించి రైతుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. అసోసియేషన్ ప్రెసిడెంటు బీవీ కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంటు కె.భాస్కర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కే.సుధీర్ రెడ్డి, ట్రెజరర్ ఆర్.లక్ష్మీపతి, జాయింట్ సెక్రటరీలు గంగాధర్, చంద్రశేఖర్ రావు సీఎంకు వినతి పత్రం అందించారు. దశాబ్దాలుగా కర్నూలు కేంద్రంగా ఆగ్రోస్ సంస్థ రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూర్చిందని అన్నారు. వాటిని దెబ్బ తీస్తూ ఆ సంస్థ స్థలంలో వైసీపీ కార్యాలయం నిర్మిస్తున్నారని అన్నారు.

సీజనల్ వ్యాధులపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీవో నరసింహనాయుడు

కర్నూలు(రూరల్), జూన్ 25: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కర్నూలు రూరల్ మండలం ఎంపీడీవో నరసింహనాయుడు అధికా రులకు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, విద్యాశాఖ, వైద్య, డీఆర్‌డీఏ శాఖ అధికారులతో ఎంపీడీవో సీజనల్ వ్యాధులపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయించి, బ్లీచింగ్‌పౌడర్‌తో క్లోరినేషన్ కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. వాటర్‌పైపులు లీకేజీలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. 0-5సంవత్సరాల పిల్లల లిస్టులు తయారు చేసుకుని ఆశాలు, ఏఎన్ఎం, సీహెచ్‌ఓలు ఇంటింట సర్వేలు చేసి వ్యాధిగ్రస్థులకు ఓఆర్ఎస్ జింక్ మాత్రలు అందించి చికిత్సలు చేయాలని, అత్యవసర పరిస్థితిలో అంబు లెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకవెళ్లాలని డాక్టర్ విజయమాధురి తెలిపారు. నీళ్ల ట్యాంకుల్లో క్లోరోనేషన్ కలిపే ప్రక్రియ గురించి ఆరడబ్ల్యూఎస్ ఏఈ రంగ స్వామి వివరించారు. డెంగీ, మలేరియా వంటి జ్వరాల గురించి సబ్‌యూనిట్ అధికారి కృష్ణమోహన్ వివరించారు. ఈసమావేశంలో ఎంఈవో, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సి.బెళగల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి మిథున్‌కుమారెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యసిబ్బందికి ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు తాగునీటిని వేడి చేసుకుని తాగాలన్నారు. ఈసమా వేశంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జిలుగను సద్వినియోగం చేసుకోవాలి: ఏవో

సి.బెళగల్, జూన్ 25: రైతులు జిలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. మంగళవారం వ్యవసాయ కార్యాలయంలో రైతులకు జిలుగ విత్తనాలను ఏవో పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిలుగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లోని ఎంపీఈవోలను సంప్రదించాలన్నారు.

మరుగునపడ్డాయి..

- అలంకారప్రాయంగా బయో టాయిలెట్లు
- కాలువలే దిక్కు
- నిర్మించారు...వదిలేశారు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 25: నగర పాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేసిన బయో టాయిలెట్లు నిరుపయోగంగా మారాయి. రూ.లక్షలు ఖర్చుపెట్టి నిర్మించిన టాయిలెట్లకు పర్యవేక్షణ లేకపోవడంతో కొరగాకుండా తయారయ్యాయి. ఒక్కో కిలోమీటరుకు ఒకటి చొప్పున నగరంలో 47 బయో టాయిలెట్లను ఇంజనీరింగ్ అధికారులు నిర్మించారు. కొద్దిరోజులు మాత్రమే పని చేసిన వాటిని అధికారులు పట్టించుకోవడం మానేశారు.

● కర్నూలు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడం కోసం బహిరంగ ప్రదేశాల్లో మల మూత్రవిసర్జన చేయకుండా ఉండాలనే ఉద్దేశంతో బయో టాయిలెట్లను ఏర్పాటు చేశారు. ఒక్కోదానికి రూ.లక్షకు పైగా ఖర్చుచేశారు. నగరంలోని రద్దీ ప్రాంతాలలో వీటిని ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణ లేకపోవడంతో అధ్వానంగా మారాయి. టాయిలెట్ల బాధ్యత తీసుకున్న ఏజెన్సీ పట్టించుకోకపోవడంతో అవి కాస్త మూలనపడ్డాయి. వాటికి నీటి వసతి కరువైంది. ప్రధానంగా కొన్ని ప్రాంతాలలో వాటిని ఉపయోగించడకపోవడంతో తీవ్ర దుర్గంధం వస్తుండటంతో స్థానికులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు.



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పక్కన..

● టాయిలెట్లు ఏర్పాటు చేసిన ప్రదేశాలు..

ఓపెన్ ఎయిర్ థియేటర్ వెనుక, గడియారం ఆసుపత్రి, హజీరా కాలేజీ, జమ్మిచెట్టు హంద్రీ బ్రిడ్జి, కలెక్టరేట్ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, బుధవారపేట పెట్రోల్ బంకు, మాంటిస్సోరి పాఠశాల, విజయ డెయిరీ, రైల్వే స్టేషన్ ఎదురుగా, రాజ్‌థియేటర్, ఆర్ఎస్‌రోడ్డు ఆటో స్టాండ్, ఎస్టీబీసీ కళాశాల, వెంకటరమణ కాలనీ, బిజీ రోడ్డు, ఎస్ఏపీ క్యాంపు, ఈద్గా, చిన్నపార్కు, ప్రభుత్వ ముద్రణాలయం, నగర పాలక సంస్థ, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఐఅండ్ పీఆర్ కార్యాలయం, సిల్వర్‌జూబ్లీ కళాశాల, డాక్టర్స్ కాలనీ, బిర్లా కాంపౌండు, రైతు బజార్ కూడలి ప్రాంతాలలో సుమారు 47 బయో టాయిలెట్లను ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల సుమారు 25కి పైగా తొలగించారు.

● డీవీఆర్‌కు ఎదురుగా ఉన్న చిన్నపార్కు వద్ద బయో టాయిలెట్లు ఏర్పాటు చేసి ఒక్క సంవత్సరం కూడా కాలేదు. మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఒక్కో దాని కోసం రూ.లక్ష వరకు నిధులు కేటాయించారు. మొన్నటి వరకు ఓ పొదుపులక్ష్మి గ్రూపు మహిళలకు వాటిని నిర్వహించే వారు. అయితే నీటి వసతి సరిగ్గా లేకపోవడంతో మూలనపడ్డాయి. ప్రతి రోజు మున్సిపల్ కార్మికులు టాయిలెట్లకు నీటి వసతి కల్పించాలి. ఈ క్రమంలో నిర్వహణ భారం కావడంతో గ్రూపు మహిళలు తప్పుకు న్నారు. చివరికి జనాలు చిన్నపార్కు పక్కనే పెద్ద కాలువ ఉంది. దానినే మరుగుదొడ్డిగా ఉపయోగించడం గమనార్హం.



డీవీఆర్ హోటల్ ఎదురుగా నిరుపయోగంగా టాయిలెట్లు

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పక్కనే రెండు టాయిలెట్లు నిర్మించారు. ఈ మార్గంలో నిత్యం వందల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన సమయంలో ఇక్కడికి ప్రజలు పెద్ద ఎత్తున వస్తారు. ప్రస్తుతం ఇవి నిరుపయోగంగా మారాయి. రూ.2లక్షలకు పైగా ఖర్చు చేసి ఏర్పాటు చేసిన టాయిలెట్స్ అలంకార ప్రాయంగా మారాయి.

పర్యవేక్షణ భారమైంది

టాయిలెట్ల పర్యవేక్షణ భారమైంది. గతంలో ఏజెన్సీలకు ఇచ్చాం. అయితే వాటిని నిర్వహించుకోవడంతో విఫలమయ్యారు. కార్మికులతో పర్యవేక్షణ చేయిద్దామంటే ఇప్పటికే నగర పాలక సంస్థలో కార్మికుల కొరత ఉంది. ఇప్పటికే సగానికపైగా తొలగించాము. త్వరలోనే వాటిపై నిర్ణయం తీసుకుంటాం.

- కే.విశ్వేశ్వరరెడ్డి, మెడికల్ హెల్త్ ఆఫీసర్

విత్తన సాగులో రైతన్న బిజీ

- పెరిగిన ఎరువులు, విత్తనాల ధరలతో అన్నదాత ఆందోళన

ఓర్వకల్లు, జూన్ 25: మండలంలో గత పది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. పొలాల్లో విత్తనాలు నాటే పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, గుట్టపాడు, హుశేనాపురం, సోమయాజులపల్లె తదితర గ్రామాల్లో పత్తి 2వేల ఎకరాలు, కొర్ర 500 ఎకరాలు, కంది 1000 ఎకరాలు, మొక్కజొన్న 1500 ఎకరాలు, ఉల్లి 500 ఎకరాలు, వేరుశనగ 600 ఎకరాలలో పంటలు వేస్తున్నారు. గత 5 సంవ త్సరాలుగా అతివృష్టి అనావృష్టితో రైతులు అప్పుల్లో కూరుకుపోయారు. ఈ ఏడాది ఎరువులు, విత్తనాలు ధరలు అధికంగా పెరగడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. అప్పులు చేసి పంటలపై పెట్టుబడులు పెడుతున్నారు. ఎకరాకు రూ.10వేల చొప్పున పెట్టుబడి పెట్టారు. విత్తనాలకు డబ్బులు లేకపోవడంతో రైతులు వడ్డీ వ్యాపారులను, బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు. బ్యాంకులు కూడా పంట రుణాలు సకాలంలో ఇవ్వడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత మూడేళ్లుగా వర్షాలు లేక పంటలకు దిగుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల వలయంలో కూరుకుపోయారు. ఈ ఏడాదైనా తమ తలరాతలు మారుతాయన్న ఉద్దేశంతో అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నారు.



పొలంలో విత్తనం వేస్తున్న రైతు

ఎరువులు, విత్తనాల ధరలు తగ్గించాలి



గత ఏడాది కంటే ఈ ఏడాది ఎరువుల ధరలు ఆకాశన్నంటాయి. సన్న, చిన్నకారు రైతులు ఎరువులను కొనుగోలు చేసే స్తోమత లేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. సన్న చిన్న కారు రైతులకు 90 శాతం సబ్సిడీతో ఎరువులు, విత్తనాలు అందించాలి.

- నజీర్, రైతు

పంట రుణాలు అందించాలి



రైతులకు బ్యాంకులు, సొసైటీ రుణాలు సకాలంలో అందించాలి. పంట రుణాల కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. బ్యాంకులు ఆలస్యంగా రుణాలు ఇస్తుండటంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది.

- ఆదాంబాషా, రైతు

హెల్త్ వర్సిటీకి ఎన్టీఆర్ పేరుపై హర్షం



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు(అర్బన్), జూన్ 25: వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరు మార్చడం హర్షనీయమని సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ క్యాబినెట్ తొలి సమావేశంలోనే నిర్ణయం తీసుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. హెల్త్ యూనివ ర్సిటీ పేరు మార్పు వల్ల ఇప్పటి వరకు చదువుకున్న సర్టిఫికెట్లు పొందిన వారు ఇబ్బందులు పడతారని, అనేక మంది వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. విదేశాలకు వెళ్లే వైద్య విద్యార్థులకు కళాశాల పేరు మారడం వలన సాంకేతిక పరమైన సమస్య లు ఎదుర్కొంటున్న కారణంగా టీడీపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని సవరిస్తూ దివంగత ఎన్టీఆర్ ప్రజలకు చేసిన సేవలకు గుర్తింపుగా యూనివర్సిటీకి ఆయన పేరుతో పునర్ నామకరణం చేసిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, ధరూర్ జేమ్స్, ఎస్కే బషీర్, బాల వెంకటేశ్వరరెడ్డి, ఆదాం, భాస్కర్ పాల్గొన్నారు.

హెడ్ వాటర్ వర్క్స్ పనులపై విచారణ జరిపించాలి



ఇన్‌చార్జి కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న రహమతుల్లా

కర్నూలు(న్యూసిటీ), జూన్ 25: నగరంలోని అశోక్‌నగర్ హెడ్ వాటర్ వర్క్స్ పనులపై విచారణ జరిపించాలని ఎంఐఎం పార్టీ జిల్లా కార్యదర్శి రహమతుల్లా డిమాండ్ చేశారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ పీవీ రామలింగేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రహమతుల్లా మాట్లాడుతూ నగర పాలక సంస్థ హెడ్ వాటర్ వర్క్స్‌లో నూతనంగా అమర్చిన ఎలక్ట్రో మేగ్నటిక్ ఫ్లో వాటర్ విత్ జీపీఎస్-స్కాడా ఒక పెద్ద స్కాము అన్నారు. ఒక కాంట్రాక్టు సంస్థతో కుమ్మక్కై సంస్థకు అనుకూలంగా టెండరు రూల్స్ మార్చి ఎవ్వరు పోటి రాకుండా విపరీతంగా ఎస్టిమేట్లు రెట్లే పెంచి దోచుకున్నారని అన్నారు. ఇందులో డీఈఈ, ఏఈలు గత 6 సంవత్సరాలుగా ఒకేచోట పని చేస్తూ దోచుకుంటున్నారని కమిషనర్‌కు వివరించారు. దీనిపై విచారణ జరిపిస్తే కోట్ల రూపాయలు కుంభకోణం బయటకు వస్తుందని అన్నారు.

వైసీపీ కార్యాలయానికి నోటీసులు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 25: కర్నూలు నగరంలోని ఆర్ఎస్ రోడ్డు కూడలిలో అనధికారంగా నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయానికి నగర పాలక సంస్థ అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. అనుమతులు లేకుండా భవనాన్ని నిర్మించారనీ, తక్షణమే అనుమతులు తీసుకోకపోతే భవన నిర్మాణంపై చర్యలు తీసుకుంటామని నోటీసులో అధికారులు పొందుపరిచారు. ఈ నేపథ్యంలో వైసీపీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ నగర పాలక సంస్థ కమిషనర్‌కు ఓ లేఖ పంపారు. ప్రభుత్వపరంగా 33 సంవత్సరాలు లీజుకు తీసుకున్నామనీ, ఇందులో ఏదైనా తప్పిదాలు ఉంటే నిబంధనల ప్రకారం పాటిస్తామని ఆమె వివరించారు. అంతవరకూ ఎలాంటి చర్యలు తీసుకోకూడదని ఆమె లేఖలో విజ్ఞప్తి చేశారు.

డయేరియా నివారణపై చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో

గూడూరు, జూన్ 25: గ్రామాల్లో డయేరియా నివారణపై చర్యలు చేపట్టాలని ఎంపీడీవో విజయసింహారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని పెంచికలపాడు గ్రామంలోని సచివాలయాన్ని ఎంపీడీవో విజయసింహారెడ్డి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని, 15 రోజులకొకసారి ట్యాంకులను శుభ్రం చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో ఈవో ఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయితీ కార్యదర్శి, ఇంజ నీరింగ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు : సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), జూన్ 25: చిన్న పిల్లలకు వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం సూపరింటెండెంట్ చాంబర్‌లో ఆయన పీడియాట్రిక్ కేసులపై సమీక్ష నిర్వహించారు. సమీక్షలో పీడియాట్రిక్ హెచ్‌వోడీ డా.విజయానందబాబు, ప్రొఫెసర్లు శారద, సుహాసిని, అసోసియేట్ ప్రొఫెసర్లు ఎం.మల్లికార్జున, ఎం.ప్రకాష్ కుమార్, ఎస్.శ్రీలత, పి.రవీంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపరింటెం డెంట్ సి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో చిన్నపిల్లలకు వచ్చే వ్యాధులు, చికిత్స, పడకలు అందుబాటులో ఉన్న తరుచూ తనిఖీలు చేయా లన్నారు. చిన్న పిల్లల కోసం పది పడకలతో ప్రత్యేక గదిని ఏర్పాటు చేయా లని పీడియాట్రిక్ హెచ్‌వోడీ విజయానందబాబు ఆదేశించారు. సీజనల్ వ్యాధులకు అనుగుణంగా మెయిన్ స్టోర్‌లో మందులు అందుబాటులో ఉంచాలన్నారు. చిన్న పిల్లలకు సంబంధించిన ల్యాబ్ రిపోర్టులను వెంటనే జారీ చేయాలని సీఎస్ ఆర్ఎంవో, ఏఆర్ఎంవోలను ఆదేశించారు. పీడియాట్రిక్ కేసుల వ్యాప్తిపై రోజువారి డేటాను సూపరింటెండెంట్ దృష్టికి తీసుకుపోవా లని హెచ్‌వోడీని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలినప్పుడు ఆసుప త్రిలో మరణాల రేటు సున్నా ఉండేటట్లుగా చూసుకోవాలని వైద్యులను ఆదేశించారు. సమీక్షలో పీడియాట్రిక్ వైద్యులు, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్పీ సావిత్రీబాయి, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ నరసింహారావు, ఫార్మాసిస్టు శర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి

ఎమ్మెల్యేను కలిసిన బీజేపీ లీగల్ సెల్ నాయకులు



ఎమ్మెల్యే దస్తగిరిని కలిసిన బీజేపీ లీగల్ సెల్ నాయకులు

కర్నూలు(లీగల్), జూన్ 25: ఎన్డీయే కూటమి అభ్యర్థిగా కోడుమూరు ఎమ్మెల్యేగా గెలిచిన బొగ్గుల దస్తగిరిని బీజేపీ లీగల్ సెల్ నాయకులు మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ త్వరగా ఏర్పాటయ్యేలా చొరవ తీసుకోవాలని లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ మోహన్ రెడ్డి కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో న్యాయవాదులు నరసింహులు, అయ్యస్వామి, జయసింహ, మంజునాథ్ ఉన్నారు.

కర్నూలులో రామోజీరావు విగ్రహం ఏర్పాటు చేస్తా



బోచర్‌ను ఆవిష్కరిస్తున్న నగరూరు రాఘవేంద్ర తదితరులు

కర్నూలు(కల్చరల్), జూన్ 25: కర్నూలులో రామోజీరావు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు విగ్రహం ఏర్పాటు చేస్తానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. మంగళవారం సాయంత్రం కర్నూలు నగరంలోని 46వ వార్డు నరసింహారెడ్డి నగర్‌లోని నగరూరు రాఘవేంద్ర మినీ బ్యాంకెట్ హాలులో జూన్ 27న రామోజీరావు సంస్మరణ సభ జరిగే కార్యక్రమ కరపత్రాలను ఫొటో వీడియో జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మీసాల రామస్వామి ఆధ్వర్యంలో విడుదల చేశారు. కార్యక్రమంలో బీసీ జనచైతన్య సభ రాష్ట్ర ఉపా ధ్యక్షుడు శేషఫణి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీనాయుడు, గోపాల్, శివయ్య, శ్రీను పాల్గొన్నారు.

మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కలిసిన బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), జూన్ 25: గిరిజన, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని శాసన మండలి సభ్యుడు బీటీ నాయుడు కలిశారు. మంగళవారం వెలగ పూడి సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న బీటీ నాయుడు

అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సస్పెన్షన్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 25: కర్నూలు అర్బన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పని చేస్తున్న కె.లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తూ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా లక్ష్మీనారాయణ ఆదోని రెగ్యులర్ పోస్టింగ్‌తో పాటు కర్నూలుకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. మహిళా వార్డెన్లను వేధిస్తున్నారంటూ ఆయనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ క్రమంలో వచ్చిన ఆరోపణలపై అధికారులు విచారణ నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీబీసీడబ్ల్యూవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో రాణించాలి

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 25: మహారాష్ట్రలోని పూణేలో ఈనెల 27, 28 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి జూనియర్ (అండర్-18) రగ్బీ పోటీల్లో రాష్ట్ర స్థాయి జట్టు రాణించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు అన్నారు. మంగళవారం రాష్ట్ర జట్టుక ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందిం చారు. ఇటీవల విశాఖ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

చర్మ వ్యాధులపై అవగాహన ర్యాలీ

కర్నూలు(హాస్పిటల్), జూన్ 25: తెల్లమచ్చలనీ బొల్లి కాదని ఇది ఒక చర్మవ్యాధి అని విశ్వభారతి మెడికల్ కాలేజీ చర్మ వ్యాధుల విభాగపు ప్రొఫెసర్ డాక్టర్ బి.ఉదయ్ కుమార్ అన్నారు. ప్రపంచ బొల్లి నివారణ దినం సందర్భంగా మంగళవారం కాలేజీలో వైద్య విద్యార్థులు అవగాహన ర్యాలీని నిర్వహించారు. బొల్లి వ్యాధి అనేది ఆటో ఇమ్యూన్ డిజార్డర్ అని, ఇది జన్యుపరమైన న్యూరోజెనిక్ వల్ల వచ్చిందన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఎమ్మెల్యే

ఆదోని, జూన్ 25: వాహనదారులకు రోడ్ల భద్రతపై అవగాహన కల్పించి-ప్రవ మాదాలు జరగకుండా పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ అధికారులకు ఆదేశించారు. మంగళ వారం సబ్‌కలెక్టర్ సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గత సమీక్షలలో జరిగిన రోడ్ సేఫ్టీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల గురించి ఆరా తీశారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలో రోడ్లపై ఉన్న గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చాలని అర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. పట్టణంలో పార్కింగ్ సమస్యపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఆక్రమణకు గురైన ప్రభుత్వ రహదారులు, ప్రభుత్వ భవనాలను త్వరగతిన గుర్తించి తక్షణమే నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో అధిక వర్షపాతం పడే సూచన ఉన్నందువలన లోతట్టు ప్రాంతాలను గుర్తించి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. సమావేశంలో ఏవో శేషయ్య, డీఎస్పీ శివనారాయణ స్వామి, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి, నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకర్ రెడ్డి, ఆర్టీవో నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శిశిర దీప్తి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫీ, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయానికి భారీ గండి

మద్దికెర, జూన్ 25: మద్దికెర మేజర్ గ్రామ పంచాయతీ 9 నెలలకు నిర్వహించిన దినసరి, వారం కమేలా వేలం పాటల్లో పంచాయతీకి రూ.1.32 లక్షల ఆదాయం తగ్గింది. మంగళవారం డీఎల్‌పీవో ప్రకాష్ నాయుడు, సర్పంచు బండారు సుహాసిని అధ్యక్షతన 2025 మార్చి 31నాటికి సుంకం వసూలు చేయడానికి నిర్వహించిన వేలం పాటల్లో గత ఏడాది దినసరి మార్కెట్ రూ.2 లక్షలకు పోగా.. ఈ ఏడాది రూ.1,12,500, గత ఏడాది వారం మార్కెట్ రూ.87వేలు రాగా, ఈ ఏడాది రూ.47వేలు, గత ఏడాది కమేలా రూ.20వేలు పోగా, ఈ ఏడాది రూ.5,500లకు వేలం పాటలు జరిగాయి. మొత్తం రూ.1.65లక్షలకు వేలం పోగా గత ఏడాది కంటే రూ.1.32 లక్షల ఆదాయం తగ్గింది.

తాగునీటి మోటారు అపహరణ

కోసిగి, జూన్ 25: స్థానిక బుగేని చెరువు సమీపంలో ఉన్న సంపుపై ఉన్న ఎస్‌హెచ్‌పీ విద్యుత్ మోటారును సోమవారం అర్థరాత్రి దొంగలు అపహరించినట్లు పంచాయతీ కార్యదర్శి ఎం.తిరుమలేశ్వరరెడ్డి మంగళవారం ఎస్‌ఐ సతీష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. చింతకుంట రోడ్డుకు వెళ్లే బుగేని చెరువు సమీపంలో సంపు దగ్గర ఉన్న ఎస్‌హెచ్‌పీ విద్యుత్ మోటారు కనిపించకపోవడంతో మోటారు దొంగతనానికి గురైందని తెలుసుకుని ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే మే 3వ తేదీన పులికనుమ ప్రాజెక్టు దగ్గర ఐదు మోటార్లకు సంబంధించిన కేబుల్ వైరును అపహరించినట్లు తెలిపారు.

మందకృష్ణతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం

కోసిగి, జూన్ 25: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మందకృష్ణతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు బాస్కర్, సుబాష్ చంద్ర అన్నారు. మంగళవారం కోసిగిలో ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాలుకా మండల కన్వీనర్ చింతకుంట నాగరాజు అధ్యక్షతన సమావేశంలో మండల అధ్యక్షుడిగా చింతకుంట సామేల్, అధికార ప్రతినిధిగా వందగల్లు నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా చిదానంద, ఉపాధ్యక్షులుగా ప్రకాష్, ఈరన్న, సభ్యులుగా హనుమంతు, నరసింహులు, తిక్కస్వామి, నరసయ్య, లింగమూర్తి, రుద్రముని తదితరులను ఎన్నుకున్నారు.

దరఖాస్తు చేసుకున్నవారందరికీ సీటు కేటాయించాలి



హాస్టల్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్‌ఏవీఎఫ్ నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 25: హాస్టల్లో వసతి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి గ్రామీణ ప్రాంత విద్యార్థికి హాస్టల్ సీటు ఇవ్వాలని ఆర్ఏవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి ఖాజా డిమాండ్ చేశారు. మంగళవారం సమీకృత హాస్టల్ ఎదుట నిరసన తెలిపారు. బీసీ విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం లేక మధ్యలోనే చదువులు మానేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు ఎక్కువగా వలసలు వెళ్తున్నారని, తమ పిల్లలను హాస్టల్లో వదిలేందుకు ఆసక్తి చూపుతున్నా.. సీట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి హాస్టల్ సీట్లను పెంచి బీసీ బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు ఉషారాణి, పర్వీన్, ఆదిలక్ష్మీ, శిల్పా పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలి

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 25: పట్టణంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి సోమశేఖర్, బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ పగడాల రమేష్ కోరారు. మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని కలిసి వినతిపత్రం అందజేశారు. హాస్టళ్లకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. దీంతో అరకొర వసతుల మధ్య విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. నాయకులు పవన్, సాయి, విజయ్, తేజ పాల్గొన్నారు.

డీఎస్సీకి క్యాబినేట్ ఆమోదం పై హర్షం

ఆలూరు, జూన్ 25: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు డీఎస్సీ విడుదల కోసం క్యాబినేట్‌లో ఆమోదం చేయడం హర్షణీయమని ఎస్టీయూ రాష్ట్ర నాయకులు నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక భవిత భవన్ వద్ద నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. ఆలూరు తాలుకాలోని ఏకోపాధ్యాయ పాఠశాలల్లోని ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు అశ్విన్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో సీసీ రోడ్డుకు భూమి పూజ

కౌతాళం : వల్లూరు గ్రామంలో మంగళవారం సర్పంచు పంపాపతిగౌడ్, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి అడివప్పగౌడ్ ఆధ్వర్యంలో పలుకాలనీలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం టీడీపీ అధికారం రావడంతో గ్రామంలోని ప్రతి కాలనీలో సీసీ రోడ్డు వేసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

వ్యయసాయం



రైతన్నకు ఏటేటా వ్యవసాయం భారంగా మారుతోంది. ఏటేటా ఖర్చులు పెరిగిపోతున్నాయి. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ధాన్యం సొమ్ము పూర్తిగా రాక.. పెట్టుబడులకు సకాలంలో రుణాలు అందక అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు విత్తనాలు, ఎరువుల ధరలు పెరిగి రైతులను మరింత కష్టాలపాలు చేస్తున్నాయి.

- పెరుగుతున్న సాగు ఖర్చులు
- రైతన్నకు భారమైన వ్యవసాయం
- ఏడాది ఏడాదికి పెరుగుతున్న ఎరువుల ధరలు

గోనెగండ్ల, జూన్ 25: కష్టజీవి రైతున్నకు వ్యవసాయం అంటే వ్యసనం. ఎంతో ఆశతో రైతన్న ఖరీఫ్ సాగుకు ఉపక్రమించారు. ఇప్పటికే పలుప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. దీంతో పలు ప్రాంతాల్లో విత్తనాలు విత్తుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో సాగుకు ఆశించిన మేర వర్షాలు కురవకపోయినా బావులు, బోర్లకింద పొలాల్లో విత్తనాలు విత్తుతున్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో 48వేల హెక్టార్ల సాగు చేయాల్సి ఉంది. గోనెగండ్ల మండలం 14వేలు, ఎమ్మిగనూరులో 30వేలు, నందవరం మండలంలో 13వేల హెక్టార్లలో పంటలు సాగు చేయాలి. ఇప్పటికే బావులు, బోర్ల దగ్గర కొంత మేర సాగు చేశారు. పెరుగుతున్న కూలీ రేట్లు, ఎరువులు, పిచికారిమందుల ధరలు రైతును భయపెడుతున్నాయి. వ్యవసాయం బరువెక్కుతోంది. బ్యాంక్ అధికారులు ఇచ్చే అరకొర రుణం రైతులకు ఏ మాత్రం చాలడం లేదు. వడ్డీవ్యాపారులను అశ్రయించి అప్పుల్లో కూరుకుపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న ధరలు...కుదేలవుతున్న రైతు: రైతుల పెట్టుబడులు అడ్డదిడ్డంగా పెరుగుతున్నాయి. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీతో పెరిగిన ధరలతో పంట సాగు ఎలా చేయాలంటు రైతులు మదనపడుతున్నారు. దీన్ని అసరాగా చేసుకొని కొందరు ఎరువులు,పిచికారి మందుల వ్యాపారులు ధరలు పెంచారు. డీజిల్, పెట్రోల్ ధరలు నాలుగురోజులకు ఒక మారు పెరుగుతుండటంతో ట్రాక్టర్ల బాడుగలు విపరీతంగా పెరుగుతున్నాయి. చాల మంది రైతులు ఎద్దులను కాదని ట్రాక్టర్ల ద్వార వ్యవసాయం చేస్తున్నారు. దీంతో ట్రాక్టర్ల బాడుగ ఎకరంకు రూ. 1200 నుంచి 1500 వరకు పలుకుతుంది. పంట పొలాల్లో పనిచేసే కూలీల ధరలు కూడ ఆకాశాన్ని చూపుతున్నాయి. ఒక్కోకూలీకి రోజుకు అవసరాన్ని బట్టి .రూ.350 నుంచి రూ. 450 పలుకుతుంది. . పెరిగిన జీఎస్టీతో ఎరువుల ధరలపై 5శాతం, పెస్టిసైడ్ పై 18శాతం, న్యూట్రిన్స్ పై 12 శాతం పెరిగాయి.

ఈ ఏడాది ధరలు

యూరియ	రూ. 266
ఎఫ్ఏసీటీ	రూ. 1180
డీఏపీ	రూ. 1450
28.28.0	రూ. 1680
14.35.14	రూ. 1680
20.20.0.13	రూ. 1150
పోటాష్	రూ. 1800
16:20:0:13	రూ. 1100
15:15:15:9	రూ. 1450

ఆశతోనే పత్తి సాగు చేస్తున్నా

గత ఎడాది 2 ఎకరాల్లో పత్తి సాగు చేశా.దాదాపు రూ. 1.5లక్షలు పెట్టుబడి వచ్చింది. కొంతమేర పంటను అమ్మకం జరిపాను ధర తగ్గడంతో నిలువ చేశాను అయితే ఇప్పటి వరకు గిట్టుబాటు ధర పలకలేదు. ఈ ఎడాదైనా గిట్టు బాటు ధర ఆశతో మళ్లీ మూడెకరాల్లో పత్తి పంటను సాగు చేశా.

- చెన్నలరాయుడు, రైతు గోనెగండ్ల.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలి

కొద్దిరోజులుగా విత్తనాలు విత్తడం మొదలైంది. ఎరువుల దుకణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువుల బస్తాలు విక్రయించాలి. అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటాం. ఎరువులు కొన్న సమయంలో తప్పని సరిగా బిల్లు రాయించుకోవాలి. అధిక ధరలకు విక్రయిస్తే మాకు ఫిర్యాదు చేయండి.

- హేమలత, ఏవో గోనెగండ్ల.

అధికారుల కళ్లల్లో ఇసుక



అక్రమంగా ట్రాక్టర్లో తరలిస్తున్న ఇసుక

పత్తికొండ టౌన్, జూన్ 25: కొంత మంది వైసీపీకి చెందిన ఇసుకాసురులు అధికారుల కళ్లల్లో ఇసుకపోస్తూ వంకలు, వాగులను తోడేస్తున్నారు. పత్తికొండ మండలం, దూదెకొండ, కనకదిన్నె, పోతిరాళ్ల గ్రామాల్లో ఇసుక ట్రాక్టర్ల యజమానులు యథేచ్ఛగా ఇసుకను తరలించి కాసుల పంట పండిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ట్రాక్టరు ఇసుక రూ.4వేల చొప్పున ముక్కు పిండి అక్రమంగా దోచేశారు. నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం ప్రజలు ఇబ్బందులను పరగణలోకి తీసుకొని ఇసుకను ఉచితంగా అందించేలా నిర్ణయం తీసుకుంది. అయితే, అక్రమ సంపాదనకు అలవాటుపడ్డ ట్రాక్టర్ల యజమానులు ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ముచేసుకుంటున్నా అధికారుల్లో చలనం లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాపై తహసీల్దార్ మధవరాజును వివరణ కోరగా కొత్త ప్రభుత్వం నుంచి ఇంకా ఫ్రీ ఇసుక అంటూ ఉత్తర్వులు రాలేదని, ఉత్తర్వులు వచ్చిన వెంటనే ఫ్రీ ఇసుక పాలసీని అమలు చేస్తామని పేర్కొనానరు. ఇసుక ను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

శ్రీమన్ న్యాయసుధ విశిష్టమైన గ్రంథం

● పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



బంగారు రథంపై ఊరేగుతున్న జయతీర్థులు

మంత్రాలయం, జూన్ 25: రాఘవేంద్రస్వామి పూర్వపు పీఠాధిపతులు జయతీర్థులు రచించిన శ్రీమన్ న్యాయసుధ గ్రంథం విశిష్టమైనదని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. మంగళవారం జయతీర్థుల మహిమోత్సవ సంస్మరణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జయతీర్థ రచించిన రచనలు, బోధనలు, చరిత్ర, సాహిత్యరచనలు అమోఘ్యమనిఅన్నారు. నవబృందావనంలో వెలసిన పద్మనాభతీర్థుల మూలబృందావన సన్నిధానానికి జయతీర్థులు న్యాయసుధ గ్రంథాన్ని సమర్పించిన రోజును గుర్తు చేసుకుంటూ ఈ ఉత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డుగ్రహిత పండితకేసరి విద్వాన్ రాజాఎస్‌గిరిరాజాచార్ మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతన యాగశాల నిర్మాణ పనులు ప్రారంభం

రాఘవేంద్రస్వామి మఠంలో పూర్వపు పీఠాధిపతుల బృందావనాలకు ఎదురుగా ఉన్న పాత యాగశాలను తొలగించే పనులు ముమ్మరంగా చేపట్టారు. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్‌లు దగ్గరుండి యంత్రాల సాయంతో పాత యాగశాలను తొలగించే పనులు చేపట్టారు.

సౌత్‌జోన్ బాక్సింగ్ పోటీలకు వెల్దుర్తి విద్యార్థి



ఎరుకలి మహేష్

వెల్దుర్తి, జూన్, 25 : వెల్దుర్తి పట్టణానికి చెందిన ఎరుకలి మహేష్ సౌత్‌జోన్ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీలు 27 నుంచి30వ తేదీ వరకు చెన్నైలో నిర్వహించనున్నారు. గతంలో స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి, గోవాలో జరిగిన జాతీయస్థాయి పోటీలలో బంగారు పతకం సాధించారు. సౌత్‌జోన్ పోటీలో ప్రతిభ కనబరచి మంచి పేరు తేవాలని కోచ్ ఫయాజ్, తండ్రి మద్దిలేటి ఆకాంక్షించారు.

సొసైటీ సభ్యత్వాలను రెన్యూవల్ చేసుకోవాలి

తుగ్గలి, జూన్ 25: సహకార పరపతి సంఘంలో ఖాతా ఉన్న ప్రతి రైతు వారి సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలని ఉప్పర్లపల్లి సొసైటీ సీఈవో గిడ్డయ్య తెలిపారు. మంగళవారం జొన్నగిరి సహకార సొసైటీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచామని, రైతుల అకౌంటు బుక్, పాస్‌బుక్, ఆధార్, పాన్‌కార్డు జిరాక్సులతో పాటు రెండు ఫొటోలు సహకార సిబ్బందికి అందజేయాలన్నారు. ఆధారాలు ఇవ్వకపోతే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సబ్సిడీలను కోల్పోవాల్సి వస్తుందన్నారు.

ఎస్సీ హాస్టల్స్ కొనసాగించాలని వినతి



ఎంపీడీవో అలివేలమ్మకు వినతి పత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మద్దికెర, జూన్ 25: మూతబడిన ఎస్సీ హాస్టల్‌ను తిరిగి తెరవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ కోరారు. మంగళవారం ఎంపీడీవో అలివేలమ్మను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గతంలో ఎస్సీ హాస్టల్‌లో దాదాపు 200 మంది విద్యార్థులు చదువుకునేవారని, ప్రభుత్వం కూడా అన్ని సౌకర్యాలు కల్పించేదని పేర్కొన్నారు. ఉన్న ఫలంగా హాస్టల్‌ను మూత వేయడంతో చాలా మంది వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలు చదువుకోవడం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ హాస్టల్‌ను తిరిగి పునరుద్ధరించడం వల్ల చాలా మంది పేద విద్యార్థులు చదువుకుంటారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్ కుమార్, తిప్పన్న, వేణు, సాయికిరణ్, రాము, జశ్వంత్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలింపు పై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హొళగుంద, జూన్ 25: ఆలూరు సివిల్ సప్లై గోడౌన్ నుంచి హొళగుంద మీదుగా అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యం అంశంపై అధికారులు విచారణకు ఆదేశించారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 24న "పేదల బియ్యం - కర్ణాటక తరలింపు" అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ స్పందించి విచారణ చేపట్టి , సంబంధిత వ్యక్తుల పై నివేదిక అందించాలని ఆదేశించినట్లు తహసీల్దార్ ఏఎన్ ప్రసాద్ రాజు తెలిపారు. దీంతో హొళగుంద మండలానికి చెందిన రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి, నివేదిక సిద్ధం చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదని పేర్కొన్నారు.

మూడునెలలుగా తిరుగుతున్నా నీటి సమస్య తీర్చరా..?



సమస్యను విన్నవిస్తున్న రామస్వామి గుడివీధి మహిళలు

మద్దికెర, జూన్ 25: 'మూడు నెలలుగా తాగునీరందక పంచా యతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎందుకు స్పందించడం లేదు' అంటూ మద్దికెరలోని రామ స్వామి గుడివీధి మహిళలు అధికారులను నిలదీశారు. మంగళ వారం పంచాయతీ కార్యాలయానికి చేరుకొని మరోమారు తమ గోడును వినిపించారు. వీధిలో కొత్తగా వేసిన కొళాయిల వల్ల ఎవరికీ సక్రమంగా నీరు రావడంలేదన్నారు. ఒకే పైపులైనుకి అధిక శాతం కనెక్షన్లు ఉండటం వల్ల దిగువ ప్రాంతానికి నీరు వెళ్తోందన్నారు. సకాలంలో ఇంటి పన్నులు, కొళాయి పన్నులు చెల్లిస్తున్నా ఎందుకు నీరు వదలడం లేదని ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామిని నిలదీశారు. మూడు నెలలుగా పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల సమయంలో నీటి సమస్య తీరుస్తామని చెప్పి ఇంత వరకూ ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. వెంటనే తాగునీటి సమస్య పరిష్కరించాలని, అదనంగా పైపులైను వేయాలని కోరారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

తుగ్గలి, జూన్ 25: దేశంలో మొట్టమొదటి బంగారు నిక్షేపాల వెలికితీత సంస్థగా గుర్తింపు పొందిన జియో మైసూరు కంపెనీ విద్యాభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ నాయకులు బాలన్న, లక్ష్మణ స్వామి, రవి యాదవ్, సర్పంచ్ ఓబులేసు, సంగాల కృష్ణ కోరారు. ఈ మేరకు మంగళవారం జొన్నగిరికి చెందిన టీడీపీ నాయకులు జియో మైసూరు కంపెనీ ప్రతినిధి రామ్మోహన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. జొన్నగిరిలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యాభివృద్ధి కుంటు పడుతోందని, ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసే లోపు జియో మైసూరు సంస్థ వారు విద్యావాలంటీర్లను ఏర్పాటు చేసి విద్యను అందించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రతినిధి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీ సీఈవో డైరెక్టర్‌తో పాటు ఉన్నత స్థాయి ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పాఠశాల అభివృద్ధికి పాటుపడతామనితెలిపారు. టీడీపీ నాయకులు హోటల్ మల్లి, సోము, రాజు, జయరాముడు, అంజి తదితరులు ఉన్నారు

000000

డీఎస్సీలో సీఆర్‌ఎంటీలకు వెయిటేజ్ కల్పించాలి

● మంత్రి నారాలోకేశ్‌కు 'సమగ్ర' ఉద్యోగుల వినతి

గోనెగండ్ల, జూన్ 25: ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీ(ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాలు)లో సీఆర్‌ఎంటీ (సమగ్రశిక్షణా ఉద్యోగులు) లుగా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం వెయిటేజ్ కల్పించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కర్నూలు జిల్లా సీఆర్‌ఎంటీ నాయకులు సుంకన్న, పుల్లన్న, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు రామశేకర్, చంద్రశేకర్ కోరారు. మంగళవారం అమరావతిలో మంత్రి లోకేశ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. 12 ఏళ్లుగా విద్యాశాఖ లో సీఆర్‌ఎంటీ, ఎంఐఎస్, డీటీపీ, పీటీఐ, ఐఈఆర్‌టీ లుగా కాంట్రాక్ట ఉద్యోగులుగా జీతాలు పెంచకపోయినా పని చేస్తున్నామన్నారు. ప్రస్తుతం కొత్తప్రభుత్వం తమకు వెయిటేజీ కల్పించాలని కోరారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన అంగన్‌వాడీ వర్కర్స్

వెల్దుర్తి : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, ప్రధానకార్యదర్శి జే.లలితమ్మ మంగళవారం విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్, శిశుసంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిలను వెలగపూడి సచివాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు.

ఎస్‌బీఐ మేనేజర్‌గా రాజశేఖర్ శర్మ

మంత్రాలయం, జూన్ 25: మంత్రాలయం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్యాంకు మేనేజర్ రాజశేఖర్ శర్మ నూతన మేనేజర్‌గా పదవీబాధ్యతలు చేపట్టారు. శ్రీశైలంలో పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ మేనేజర్‌గా పని చేస్తున్న రాఘవేంద్ర కర్నూలుకు బదిలీ అయ్యారు. మంగళవారం బాధ్యతలు చేపట్టిన రాజశేఖర్ శర్మ మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషీలను కలిసారు.

బీకాం, బీఎస్సీ కోర్సులు ప్రవేశపెట్టాలి

ఆలూరు, జూన్ 25: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం, బీఎస్సీ కోర్సులు ప్రవేశపెట్టాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామలింగయ్య అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ హెచ్ఈసీ గ్రూపు మినహా ఇతర గ్రూపులు లేక ఆదోని, గుంతకల్లు ప్రాంతాలకు వ్యయప్రయాసలతో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వెల్దుర్తి, జూన్, 25 : వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు, డయేరియా ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ హోమియో వైద్యాధికారి డాక్టర్ భారతీదేవి అన్నారు. మంగళవారం స్థానిక 12వ వార్డు దాసరివీధిలో ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అశావర్కర్లు పాల్గొన్నారు.

గౌరీ గణేష్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

ఆదోని, జూన్ 25: తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న గౌరీ గణేష్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ పై విచారణ జరిపి గుర్తింపు రద్దు చేయాలని డీఎస్ఎఫ్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు విజయ్, గోవిందరాజులు, అరవింద్, కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సబ్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు ఆడుకోవడానికి గ్రౌండ్ లేదని, బహిరంగంగా ఫీజుల పట్టిక లేదని, సరైన సౌకర్యాలు లేవని ఫిర్యాదు చేశారు.

ఆలయ అభివృద్ధి కోసం సమష్టిగా కృషి చేద్దాం

ఆదోని టౌన్, జూన్ 25: ఎంతో చరిత్ర కలిగిన అంభా భవాని దేవాలయ అభివృద్ధి కోసం అందరూ సమిష్టిగా కృషి చేద్దామని దేవాలయ ధర్మకర్తగా జిందే శంకర్ అన్నారు. ధర్మకర్తగా ప్రమాణస్వీకారం చేసిన ఆయనను మంగళవారం సమాజ బంధువులు సన్మానించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు జిందే ప్రకాష్, పాండురంగారావు, ఎగ్బోటే శ్రీకాంత్, పొందే నాగరాజ్ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందరినీ బడుల్లో చేర్పించాలి

పత్తికొండ టౌన్, జూన్ 25: బడి బయట ఉన్న బడిఈడు పిల్లలందరినీ బడుల్లో చేర్పించాలని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబ తల్లిదండ్రులను కోరారు. 'పదండి వెళ్దాం బడికి' కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ బడుల్లో ఉండాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయురాలు రుక్మిణి, సునీత, చాముండేశ్వరి, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు

మద్దికెర, జూన్ 25: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, పత్తికొండ ఎమ్మెల్యేగా కేఈ శ్యాంబాబు విజయం సాధిస్తే తిరుపతికి వచ్చి తలనీలాలు సమర్పించుకుంటామని చేసిన మొక్కును టీడీపీ నాయకులు మంగళవారం తీర్చుకున్నారు. మండల పరిధిలోని పెరవలి గ్రామానికి చెందిన మండల టీడీపీ కార్యదర్శి పెరవలి రామాంజనేయులు, పంచాయతీ సభ్యులు ప్రభాకర్ తిరుపతికి కాలినడకన మెట్లు ఎక్కి తలనీలాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మంచి పరిపాలన వచ్చి, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని మొక్కుకున్నట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

కోసిగి, జూన్ 25: చిన్న వయసు నుంచే విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సెబ్ సీఐ ఎస్.మహబూబ్ బాషా అన్నారు. మంగళవారం కోసిగిలోని బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా సామూహిక అవగాహన వ్యాప్తి చేయడం కోసం విద్యార్థుల చేత ఆయన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ రమేష్‌బాబు, బాలురు, బాలికల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఆదర్శ, కస్తూర్బాలో సీట్లు పెంచాలని ధర్నా

ఆస్పరి, జూన్ 25: నియోజకవర్గంలో ఆదర్శ, కస్తూరిబా పాఠశాలలో పేద విద్యార్థులకు సీట్లు పెంచాలని సీపీఐ లిబరేషన్ నాయకులు ధర్నా నిర్వహించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ తాలుకా కార్యదర్శి మునిస్వామి మాట్లాడుతూ వ్యవసాయ కూలి పనుల ఆధారంగా బతికే నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పేద విద్యార్థులకు సీట్లు లేవని, తిరిగి వెనక్కి పంపిస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. అధికారులు జిల్లా ప్రభుత్వ ఉన్నతాధికారులు నియోజకవర్గం పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో శేక్షావలి, వీరేష్, గోవిందు, రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.